క్లుప్తంగా

ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఉయ్యాలవాడ : ఏటా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి, మిరప పంటలే కాకుండా ప్రత్యామ్నాయంగా ముంగారు పత్తి, సోయాబీన్ సాగు చేసేందుకు ఈ ఏడాది రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా జూన్‌లో సాధారణ వర్షపాతం 63 ఎం.ఎం.కాగా, 67.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని ఇంజేడు, ఆర్.పాంపల్లె, ఉయ్యాలవాడ, అల్లూరు, నర్సిపల్లె, కొండుపల్లె, తదితర గ్రామాల్లో పత్తితో పాటు, సోయాబీన్ సాగులో నిమగ్నమై ఉన్నారు. గత ఏడాది సోయాబీన్ దిగుబడులు ఎకరాకు 6 – 10 క్వింటాళ్ల వరకు రాగా, మార్కెట్‌లో క్వింటా రూ. 6వేల నుంచి రూ.7 వేల వరకు లభించింది. దీంతో అన్నదాతలు సోయాబీన్ జెఎస్ 335 రకం.. ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనం సాగు చేస్తున్నారు.

ముగిసిన గంగ జాతర



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర ఆదివారం ముగిసింది. గ్రామస్తులు అమ్మవారికి పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని పాలేటి యాగం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, హారతులు పట్టి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భారీగా భక్తులు చీర,సారె, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

పంటల బీమా మంజూరు

గోస్పాడు: గత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా మంజూరైందని మండల వ్యవసాయ అధికారి స్వప్నిక తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూగత ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి, ఉల్లి పంటలు సాగుచేసి సరైన దిగుబడులు రాక నష్టపోయిన 675 మంది రైతులకు రూ.1.39 కోట్ల పంటల బీమా మంజూరైందని, జాబితాను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామని, ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 4 వ తేదీ లోపు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని సూచించారు. త్వరలో రైతుల ఖాతాల్లో బీమా మొత్తం జమ వుతుందని వివరించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇతర రంగాలకు నిధులను మళ్లించకుండా కార్మికుల సంక్షేమ పథకాలకు కేటాయించాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికునికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, పేద కార్మికులకు ఇళ్ల నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇర్ఫాన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఫీ, మహబూబ్ బాషా, మున్నా, సయ్యద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

నంద్యాల (రూరల్): మండలంలోని అయ్యలూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణ శ్రీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మండల కన్వీనర్ బసవేశ్వర రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముందు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుంటారన్నారు. మండలస్థాయి అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కచ్చితంగా హాజరు కావాలని కోరారు.



నా పేరు దూదేకుల కమల్‌బీ. మాది నంద్యాల మండలం బి.కానాల గ్రామం. మా ఆయన వ్యవసాయ కూలీ. గతంలో పిల్లల చదువు కోసం వారికి కావలసిన వివిధ ధ్రువ పత్రాలు అవసరం కాగా.. కూలీ పనులు వదులుకుని నంద్యాలకు వెళ్లి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రెండు, మూడు వారాలు తిరిగాడు. అధికారులకు ఎంతో కొంత ముట్ట చెబితే పని చేసిపెట్టారు. ప్రస్తుతం మా పిల్లలు అమీనా బీ, ఖాజా హుసేన్‌కు ఆదాయ, కుల ధ్రువ పత్రాలు అవసరం కాగా వలంటీర్‌ను సంప్రదిస్తే ఇంటికి వచ్చి ఇచ్చారు. నేడు అవస్థలు తప్పడంతో పాటు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు.



ధ్రువ పత్రం చూపుతున్న ఈమె పేరు మార్తమ్మ. దొర్నిపాడు మండలంలోని గుండుపాపల గ్రామంలో నివాసం ఉంటుంది. ఈమెకు 45 ఏళ్లు పూర్తి కావడంతో వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత పొందింది. పథకం వర్తించాలంటే కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలని సూచించారు. అయితే తన వద్ద లేవని చెప్పడంతో వలంటీర్లు ఇంటికే వచ్చి అవసరమైన పత్రాలు తీసుకెళ్లి శనివారం కుల, ఆదాయ ధ్రువ పత్రాలు పిలిచి మరీ అందజేశారు. ఈ పత్రాలు చదువుకుంటున్న మా పిల్లలకు ఉపయోగపడతాయని చెబుతోంది.

మారిన బడి

- నాడు–నేడుతో సర్కారు బడులకు నూతన రూపు
- పాఠశాలల అభివృద్ధికి రూ. 40.26 కోట్లు మంజూరు
- పూర్తిస్థాయి సౌకర్యాలతో ఆకట్టుకుంటున్న స్కూళ్లు
- రెండు విడతల్లో 114 పాఠశాలల్లో వసతులు
- గదుల గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు

శిథిలమైన భవనాలు, ఇరుకు గదులు, మంచినీటి కోసం రోడ్లపై విద్యార్థుల పరుగులు, ఆవరణలో చెత్త కుప్పలు, నేలపైనే అభ్యసన, చీకటి గదుల్లో బోధన, అత్యవసరమైతే చెట్ల చాటుకు, సరిగా రాని ఉపాధ్యాయులు ఇవీ..గతంలో సర్కారు బడులకున్న నిర్వచనం. పాలన మారింది. పరిస్థితులు మారాయి.. ప్రస్తుతం నాడు–నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ స్థాయిని తలపించే వసతులు, విద్యుత్ వెలుగుల్లో తరగతి గదులు,గ్రీన్‌బోర్డు, బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి కుళాయిలు, గదుల గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు, శుభ్రంగా ఆవరణ, బాత్‌రూంలు, నాణ్యమైన బోధన, ఆహ్లాదకరమైన వాతావరణం.. ఇలా అన్ని విధాలుగా జగనన్న ప్రభుత్వం బడులను తీర్చిదిద్ది ఆదర్శంగా మార్చింది.



మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు

గోస్పాడు: అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు పూనుకున్నారు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. మొదటి ప్రాధాన్యతగా పాఠశాలలను తీర్చిదిద్దడం. ఇందుకు నాడు–నేడు పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించి దేశంలో ఎక్కడా లేని విధంగా బడుల్లో తొమ్మిది రకాల వసతుల కల్పనకు పూనుకుంది. అనుకున్నదే తడవుగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది. తొలివిడతలో కొన్ని పాఠశాలలను తీర్చిదిద్దారు. దీంతో సూళ్లు ఇలా కూడా ఉంటాయా అని తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తడంతో రెట్టించిన ఉత్సాహంతో ప్రభుత్వం రెండో విడత కింద మరిన్ని పాఠశాలలను రూపుదిద్దే పనులు చేపట్టింది. ఇప్పటికే పనులు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి.

రెండువిడతల్లో 114 పాఠశాలల అభివృద్ధి..

గోస్పాడు, నంద్యాల మండలాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లోని 114 ప్రభుత్వ పాఠశాలలను రెండు విడతల్లో అభివృద్ధి చేశారు. మొదటి విడత కింద 37 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో గోస్పాడు మండలంలో 14, నంద్యాల మండలం, అర్బన్ ప్రాంతాల్లో 23 పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.10.37కోట్లు వెచ్చించారు. అలాగే రెండో విడత కింద గోస్పాడు మండలంలో 16 , నంద్యాల మండలం, అర్బన్ ప్రాంతాల్లో 61 పాఠశాలలు ఎంపికయ్యాయి. వాటికోసం రూ.29.89 కోట్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా చేపట్టిన పనులు వేగవంతంగా చేస్తుండడంతో పాటు ఇప్పటికే కొన్ని చోట్ల పనులు పూర్తి దశకు చేరుకోగా మరి కొన్ని చోట్ల వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.



ఆకట్టుకునే చిత్రాలు..

బడి గోడలు, ప్రహరీ గోడలపై వేసిన చిత్రాలు విద్యార్థులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. పాఠ్యాంశాలు, దేశ నాయకులు, మ్యాప్‌లు, క్రీడాకారులు, చిన్నారులను ఆకట్టుకునే టామ్ అండ్ జెర్రీ తదితర చిత్రాలు ఆలోచింపజేయడమే కాకుండా వారిలో వాటి గురించి తెలుసుకునేలా తీర్చిదిద్దారు. గణితము, ఇంగ్లిష్, తెలుగు, సైన్సు, సోషల్ సబ్జెక్టులు సంబంధించిన పలు చిత్రాలు విద్యపై ఆసక్తి కలిగింపజేస్తున్నాయి.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు..



గతంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సరైన వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరిన గదుల్లో దినదిన గండంగా గడిపారు. ప్రస్తుతం పాఠశాలలను తీర్చిదిద్దడంతో ఆ అవస్థలు తప్పాయి. విద్యార్థులకు బల్లలు, తాగునీటి వసతి, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, ల్యాబ్‌ల ఏర్పాటు, బ్లాక్ బోర్డ్ స్థానంలో గ్రీన్ బోర్డులు, ఉపాధ్యాయులకు ఫర్నీచరు, అదనపు తరగతుల గదుల నిర్మాణాలు, ప్రహరీ ఏర్పాటు, వంట గది, తదితర వాటిని కల్పించారు.

పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ..

నాడు నేడు పనుల్లో నాణ్యత లోపించకుండా పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని నియమించారు. అందులో కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అబ్జర్వర్‌గా పేరెంట్ కమిటీ చైర్మన్, కో–ఆర్డినేటర్‌గా సీఆర్పీ, రికార్డు పనులకు వెల్ఫేర్ అసిస్టెంట్, టెక్నికల్ పనులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో పాటు పేరెంట్ కమిటీలోని మరో నలుగురు సభ్యులు కలిపి 9మందితో కూడిన కమిటీ పర్యవేక్షణ చేస్తుంది. ఎక్కడైనా ఏవైనా సమస్యలు తలెత్తినా, నాణ్యత లోపం ఉన్నట్లు గుర్తించిన వెంటనే వారు సంబంధిత అధికారులు దష్టికి తీసుకెళ్లి సరి చేసేలా చూస్తారు.

- గోస్పాడు మండలంలో పాఠశాలలు – 32
- మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలు – 14
- వాటికి మంజూరైన నిధులు – రూ.4.10కోట్లు
- నంద్యాల, అర్బన్‌లో మొత్తం పాఠశాలలు – 116
- మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలు – 23
- వాటికి మంజూరైన నిధులు – రూ.6.27 కోట్లు
- గోస్పాడు మండలంలో రెండో విడత ఎంపికైన పాఠశాలలు – 16
- వాటికి మంజూరైన నిధులు – రూ.6.83 కోట్లు
- నంద్యాల, అర్బన్‌లలో రెండో విడత ఎంపికైన పాఠశాలలు – 61
- వాటికి మంజూరైన నిధులు – రూ.23.06 కోట్లు

బడులను ఇలా చూడలేదు



పాఠశాలల్లో వసతులు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. విద్యార్థులను గతంలో బడులకు పంపాలన్న ఆసక్తి ఉండేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి చేశారు. వీటితోపాటు ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తుండటం అభినందనీయం. గతంలో ఎన్నడూ ఇలా బడులను తీర్చిదిద్దలేదు. అన్ని సౌకర్యాలు కల్పించడం విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుంది. – విజయ శేఖరు, గోస్పాడు

బడి బాగుంది



మా బడి చాలా బాగుంది. స్కూల్ తెరిచిన రోజే విద్యా కానుక కింది పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, షూ తదితర వాటిని అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో మాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. తరగతి గదిలో కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే ఇక్కడే ఎక్కువ వసతులున్నాయి.

– రజియా, విద్యార్థిని, పదో తరగతి, యాళ్లూరు

విద్యాభివృద్ధికి దోహదపడతాయి

నాడు–నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. పాఠశాలలకు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. గదుల గోడలపై పాఠ్యాంశాలకు అనుగుణంగా వేస్తున్న పెయింటింగ్ విద్యార్థులను ఆకట్టుకుంటోంది. దీంతో విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు అర్థమయ్యేలా, వారిలో జ్ఞాపకశక్తి పెరిగేందుకు దోహదపడతాయి. రెండో విడత నాడు–నేడు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం.

– అబ్దుల్‌కరీం,ఎంఈఓ, గోస్పాడు

సంక్షేమమే మా పథం

- ఆర్.కృష్ణాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- జోరు వానలోనూ ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే గంగుల

గ్రామంలో పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు..

మొత్తం నివాస గృహాలు	-1,015
లబ్ధి పొందిన కుటుంబాలు	- 995
ఒక్క పథకం లబ్ధి పొందిన వారు	-140
రెండు పథకాలు లబ్ధి పొందిన వారు	-304
మూడు పథకాలు లబ్ధి పొందిన వారు	- 335
నాలుగు పథకాలు తీసుకుంటున్న వారు	- 55
ఐదు పథకాలు పొందుతున్న వారు	- 34
ఆరు పథకాలు లబ్ధి పొందిన వారు	- 18
ఏడు పథకాలు తీసుకుంటున్న వారు	- 6
ఎనిమిది పథకాలు లబ్ధి పొందిన వారు	- 03
పథకాలు అందని వారు	- 20



వర్షం కురుస్తున్నా లబ్ధి పొందిన వారికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: సంక్షేమమే తమ పథమని నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలుసుకునేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం పేరిట మీ ఇంటికి వస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మండల, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్నా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షే పథకాల గురించి వివరిస్తూ..సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే పరిష్కారం చూపారు. గ్రామంలో మొత్తం నివాస గృహాలు 1,015 ఉండగా 995 ఇళ్లకు సంబంధించి 1,856 మందికి ప్రభుత్వ పథకాల ద్వారారూ రూ.9,16,83,594 ప్రయోజనం పొందారని వివరించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డేరింగుల రాజు కుటుంబానికి వివిధ పథకాల ద్వారా పెద్ద మొత్తంలో నగదు జమైందని చెప్పారు. సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ లక్ష్మీదేవి, గ్రామ నాయకులు రామకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, అశోక్‌రెడ్డి, యల్లయ్య ఉన్నారు

మా కుటుంబానికి రూ.8.1 లక్షలు వచ్చింది



ఇంత వరకు ఏప్పుడు రాని విదంగా మా కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వార మా అత్త మట్ట నాగమ్మ ఖాతాలో రూ 8,01,750 జమ అయింది. ఈ డబ్బులు రావడానికి ఎవరూ ఒక్క రూపాయి కూడా లంచం అడగలేదు. ఆఫీసుల చుట్టూ తిరగలేదు. ఇంటి దగ్గరే మా పనులు మేము చేసుకుంటున్నా సీఎం బటన్ నొక్కిన వెంటనే మా ఖాతాలో పడిపోతున్నాయి. సీఎం రుణం తీర్చుకోలేనిది. – సుభద్ర

మా కుటుంబానికి రూ.4,84,000 లబ్ధి



ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ. 4,84,000 అందింది. నిరుపేదలమైన మాకు ఇంత లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – కిన్నెర అరుంధతి

నిజాయితీకి మారుపేరు జగన్



చాగలమర్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్ రెడ్డి

చాగలమర్రి: నీతి, నిజాయితీకి మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఓ శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పార్టీ ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లయినా ఎమ్మెల్యే కాలేకపోయాడని, ప్రస్తుతం బస్సు యాత్ర పేరుతో కుల రాజకీయాలు, నిలకడలేని మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. తమ నాయకుడు ఉమ్మడి రాష్ట్రంలో 18 మందిని ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిపించారని గుర్తు చేశారు. ఆయనలా నిబద్ధత, పట్టుదల ఉండాలని చెప్పారు. ఇక వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా దక్కదని చంద్రబాబు నాయుడు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మరోవైపు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో నేడు సీట్లు దొరకడం లేదన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు పాఠశాలలను సందర్శించిన దాఖలాలు లేవని, జగనన్న పాలనలో ప్రతి ఎమ్మెల్యే ఏడాదిలో కనీసం ఐదుసార్లు పాఠశాలలను తనిఖీ చేస్తున్నారన్నారు. నారా లోకేష్ తన పాదయాత్రలో ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ అభాసుపాలవుతున్నాడని విమర్శించారు. మండలంలో పెద్దబోధనం నుంచి ముత్యాలపాడు గ్రామానికి పంచాయతీ రాజ్, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.56 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబులాల్, జి. కుమార్‌రెడ్డి, గణేష్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు ముల్లా రఫీ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, నాయబ్‌రసూల్, చక్రం షబ్బీర్, ఖాజాహుసేన్, ముల్లా ఖాదర్‌బాషా, గేట్ల మాబు, పెయింటర్ రఫీ తదితరులున్నారు.

అహోబిలం ఆలయంలో లెక్చరర్‌కు విద్యుత్ షాక్

- పరిస్థితి విషమం
- మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలింపు

ఆళ్లగడ్డ: స్వామిని దర్శించుకునేందుకు వెళ్లిన లెక్చరర్ గోవింద్‌నాయక్ విద్యుత్ షాక్‌కు గురైన ఘటన దిగువ అహోబిలంలో ఆదివారం చోటుచేసుకుంది. అహోబిలం గ్రామానికి చెందిన గోవింద్‌నాయక్ ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. తెలిసిన వారు కొందరు స్వామిని దర్శించుకునేందుకు రావడంతో వారికి దర్శనం చేయించేందుకు దిగువ అహోబిలం దేవాలయానికి వెళ్లాడు. లోపలికి వెళ్లే ముందు గుడి ముందున్న ధ్వజ స్తంభానికి నమస్కరించే క్రమంలో చేతితో స్తంభాన్ని తాకాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన వారు వెంటనే స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు వైద్యశాలకు తరలించారు.

వర్షం..హర్షం

దొర్నిపాడు:మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే విస్తారంగా సాగుచేసిన మినుము పంటకు ఈ వర్షం ఊపిరి పోసినట్లైంది. ఉదయం నుంచి సూర్యుడు ప్రతాపం చూపగా.. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం రూపంలో చల్లటి వాతావరణంను తీసుకొచ్చింది. దీంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది.



క్రిష్టిపాడులో వర్షం కురుస్తున్న దృశ్యం

రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారికి అందజేసేందుకు ఆరేళ్లుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 40 మంది రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. ఏసురత్నం, తోటమద్దులు, గౌస్, ఎల్లయ్య,బాలవెంకట్, పుల్లా నరసింహ, లక్ష్మణ్ వెంకటరావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయితే సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారం కాకపోతే జరగకపోతే మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరై అర్జీలు అందజేయాలని సూచించారు.

నేడు షిరిడీ సాయి సత్యవత్రం

చాగలమర్రి: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వెలసి అయ్యప్పస్వామి ఆలయంలో వెలసిన శ్రీషిరిడి సాయినాథుని మందిరంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా షిరిడిసాయి సత్యవ్రతం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అయ్యప్ప స్వామి సేవాసమాజం, షిరిడిసాయి సేవాసమాజం, శ్రీఆర్యవైశ్య సభ సంయుక్తంగా తెలిపారు. ఉదయం కాగడ హారతి, శ్రీసాయి చిత్రపటంతో భిక్ష, పంచామృత అభిషేకం, నూతన వస్త్రాధారణ, పుష్పలంకరణ, గోధుమలు యిసురుట, ధుని హోమ పూజ, కైప పెద్ద వేంకటనరసింహశాస్త్రితో సత్యవ్రతం, గురుపూజ మధ్యాహ్నం 12–30 గంటలకు మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అనంతరం భక్తులందరికి అన్నదానం ఏర్పాటుతో కార్యక్రమాలు ముగుస్తాయని ప్రధాన కార్యదర్శి మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.నాగభూషణం వివరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన నరసింహుడు

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామానికి చెందిన కోటు నరసింహుడు (39) అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు..మృతుడు పండ్ల తోటలు కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితేతే రెండు సంవత్సరాల నుంచి కౌలుకు తీసుకున్న పొలాల నుంచి లాభాలు రాకపోగా నష్టాలు రావడంతో అప్పులు చేశాడు. దీనికి తోడు తన ముగ్గురు కుమార్తెల్లో ఇద్దరికి వివాహం చేశాడు. ఇందుకైన ఖర్చులకు కూడా అప్పులు చేశాడు. ఇలా అప్పులు పెరిగిపోవడంతో ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి తట్టుకోలేక, రుణం తీర్చే మార్గం లేక, మనస్థాపంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పొలం పని నుంచి తిరిగొచ్చిన చూడగా విగతజీవిగా వేలాడుతుండటాన్ని చూసి బోరుమన్నారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేత



చాగలమర్రి: స్థానిక 1వ సచివాలయ పరిధిలోని 2వ వార్డుకు చెందిన కందుకూరు కరీమూన్ అనే వృద్ధురాలు అనారోగ్యంతో నంద్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్కడేనున్న ఆమె కూతురి ఇంట్లో ఉంటోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ హుసేన్‌బీ ఆదివారం అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేసింది.

ఉచిత వైద్య శిబిరం

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆదివారం నంద్యాల పట్టణానికి చెందిన ఉదయానంద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సునీత(న్యూరాలజీ), సౌమ్యారెడ్డి(కంటి వైద్య నిపుణులు) ఆధ్వర్యంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

నిండుకుండలా ఫాంపాండ్స్



దొర్నిపాడు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఫాంపాండ్స్ నీటితో నిండిపోయాయి. భూగర్భజలాలు పెంపొందించేడమే లక్ష్యంగా ఇటీవల ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 36 ఫాంపాండ్స్‌ను తవ్వారు. వర్షపు నీటితో కుంటలు పొంగిపొర్లుతున్నాయి. పొలం పనుల్లో భాగంగా ఈ నీరు తమకు ఉపయోగ పడతుందని రైతులు పేర్కొంటున్నారు.

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో నంద్యాల, పాణ్యం మండలాలకు చెందిన నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పీఆర్‌టీయూ కార్యదర్శి కృష్ణారావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల అధ్యక్షుడిగా దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా కలాం, పాణ్యం మండల అధ్యక్షుడిగా మాధవరెడ్డి, కార్యదర్శిగా నిస్సార్ అహ్మద్‌ను ఎన్నుకున్నారన్నారు.